క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

అచ్చంపేట రూరల్: అచ్చంపేట(నడింపల్లి) కేజీబీవీలో బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎంఈఓ రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలో ప్రధాన వంట మనిషి, సహాయ వంట మనిషి పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా పోస్టులకు పదో తరగతి, ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం

లింగాల: మండల కేంద్రానికి చెందిన రాములు నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు, సామాజిక కార్యకర్త కాట్రావత్ రాంజీనాయక్ గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట రాందాస్, భోజ్య, హన్మంతు, శంకర్ ఉన్నారు.

లోకాయుక్తలో సీఐ, ఎస్‌ఐలపై ఫిర్యాదు

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేదినేనిపల్లి గ్రామానికి చెందిన బోడమోని కాశన్న ఈ నెల 2న హత్యకు గురయ్యారు. హత్య చేసిన నిందితులను పోలీసులు రిమాండ్ చేయకుండా ఫిర్యాదుదారులపైనే అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని బోడమోని శివుడు ఆరోపించారు. ఈ క్రమంలో గురువారం కొల్లాపూర్ సీఐ యాలాద్రి, పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ రాజులపై లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



చారకొండ: మండల కేంద్రంలో గురువారం మసీద్, పీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణాలకు ఒక్కోదానికి రూ.8 లక్షలు, వెంకటేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.7 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను సర్పంచ్ గుండె విజేందర్ గౌడ్ ప్రారంభించారు. ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాణి నరేందర్ రెడ్డి, నాయకులు సవారు జంగయ్య, వార్డు సభ్యులు, ముస్లింలు, గ్రామస్తులు ఉన్నారు.

బహుమతులు అందజేత



తాడూరు: మండలంలో అంతారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గత సంవత్సరం 5వ, 6వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు రేణుల, సౌజన్యలకు గురువారం సర్పంచ్ జయమ్మ బహుమతులను అందజేశారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు దాతల ఇచ్చే సహాయ సహకారాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేషగిరి, మాజీ సర్పంచ్ చిన రాములు, ఉపసర్పంచ్ శాంతయ్య, పంచాయితీ కార్యదర్శి ఉమ పాల్గొన్నారు.

గద్దర్ జీవితాన్ని పాఠ్యాంశంగా ముద్రించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: గద్దర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంలో ముద్రించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తాళ్ల నిరంజన్ డిమాండ్ చేశారు.గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే గద్దర్ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గద్దర్‌ను ఎన్నోమార్లు అవమానించిందని వివరించారు.

కోతులకు ఆహారం ఇస్తే చర్యలు

మన్ననూర్: శ్రీశైలం ఘాట్ రోడ్‌లో కోతులకు ఆహారం ఇచ్చే వారిపై చర్యలు తీసుకుంటామని ఎఫ్‌ఆర్‌ఓ ఈశ్వర్ అన్నారు. గురువారం బైక్‌పై వెళ్తూ కోతుల గుంపు కారణంగా రోడ్డు ప్రమాదానికి గురైన చౌదరి గుణాకర్ ఇచ్చిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకొని మాట్లాడారు. ఘాట్ రోడ్డులో కోతులు ఇతర మూగజీవాలకు ఆహారం ఇవ్వడం చట్ట ప్రకారం నేరం అని, ఎవరైనా ఆహారం అందిస్తే రూ.10 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పర్యాటకులు, జంతు ప్రేమికులు మూగజీవాలకు ఆహారం ఇవ్వాలనే మానవత్వం ఉన్నప్పటికీ.. రోడ్లపై అలాంటి చర్యల వల్ల ఇతరులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు.

క్రీడా ప్రాంగణం పరిశీలన

ఉప్పునుంతల: మండలంలోని మొల్గరలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని గురువారం ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని పాఠశాల హెచ్‌ఎంకు సూచించారు. ఎంపీడీఓతోపాటు ఈజీఎస్ టీఏ ఉమాపతి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కొల్లాపూర్‌లో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్ రూరల్: పట్టణ, గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం రూ. కోటి ఎస్‌డీపీ నిధులతో పట్టణం సమీపంలో ఉన్న ఖాదర్ పాషా దర్గా దగ్గర నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అదే విధంగా రూ.2 కోట్ల నిధులతో పట్టణంలోని నక్క ఖాదర్ నుంచి సోమశిల గండి వరకు సీసీ రోడ్డు, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి సోమశిల వెళ్లే దారిలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి, ఈఎస్‌టీ ఈటీ అధికారి నాగేశ్వర్‌రెడ్డి, అసోసియేట్ డీన్ డాక్టర్ సైదులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రాజశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి భూమి పూజ

మండలంలోని రామాపురం గ్రామ సమీపంలో ఉన్న పశువుల వాగుపై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి గురువారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. రూ.2కోట్ల 60 లక్షల నిధులు వంతెన నిర్మిస్తునట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ఐమాక్స్ లైట్లు, క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. సర్పంచ్ భారతి, ఎంపీటీసీ వరలక్ష్మి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నిరంజన్ తదితరులు ఉన్నారు.

చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే భరోసా

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో బస్టాండ్ ఆవరణ చుట్టూ దాదాపు 40 దుకాణాలలో చిరు వ్యాపారం చేస్తూ జీవనం గడుపుతున్నారు. ఇక్కడ కాంప్లెక్స్ నిర్మించాలని ఆర్టీసీ సిబ్బంది చిరు వ్యాపారులకు నోటీసులు అందజేశారు. ఈ విషయమై బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రాజేష్, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని చిరువ్యాపారులు కలిశారు. ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి వ్యాపార దుకాణాలు తొలగించకుండా చర్యలు తీసుకొని భరోసా ఇచ్చారు.

గొల్ల కురుమల అభ్యున్నతే ధ్యేయం



గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కల్వకుర్తిరూరల్: గొల్ల కురుమల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని రఘుపతిపేటలో రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా 27 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.6500 కోట్లతో ఏడు లక్షల 80 వేల గొర్రెల కాపరులకు ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేస్తుందన్నారు. కల్వకుర్తి ప్రాంత రైతులకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తున్నామన్నారు. సెప్టెంబర్ చివరి నాటికి నాగిళ్ల వరకు సాగు నీరు అందించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోహర, వైస్ ఎంపీపీ గోవర్ధన్, మార్కెట్ చైర్మన్ విజయ్ గౌడ్, సర్పంచ్ రేణుక, జిల్లా జాయింట్ డైరెక్టర్ రమేష్, డాక్టర్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పరిశీలన

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ రెవెన్యూ శివారులో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఇళ్ల స్థలాలను పరిశీలించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. ఆర్డీఓ శ్రీను, వెల్దండ తహసీల్దార్ రవికుమార్, జర్నలిస్టులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

తెలకపల్లి: మండలంలో వివిధ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డి నివాసంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో దాదాపు 100 మంది కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, కార్వంగ ఉప సర్పంచ్ అమరేందర్‌రెడ్డితో పాటు నాయకులు తిరుపతయ్య, తిరుపతి రెడ్డి, బాలస్వామి, యాదవరెడ్డి, బుచ్చిరెడ్డి, మల్లాచారీ, విష్ణువర్ధన్‌రావు, శ్రీధర్‌రెడ్డి, రాముడు, శ్రీనివాస్‌రెడ్డితో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కండువా కప్పి రేవంత్‌రెడ్డి వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో బండ పర్వతాలు, యాదవ రెడ్డి, వెంకటయ్య గౌడ్, విష్ణువర్ధన్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల సందర్శన



ఉప్పునుంతల: మండలంలోని తాడూరు, అయ్యవారిపల్లి గ్రామాల్లో ఎన్నికల పోలింగ్ స్టేషన్లను గురువారం అచ్చంపేట ఆర్డీఓ గోపిరాం సందర్శించారు. అయ్యవారిపల్లిలో పాఠశాల భవనం నిర్మాణంలో ఉన్నందున పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పోలింగ్ స్టేషన్ కోసం ఎంపిక చేసినట్లు ఆర్డీఓ తెలిపారు. ఆర్డీవోతో పాటు తహసీల్దార్ శైలేంద్రకుమార్, ఆర్ఐ రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

సమ్మెకు మద్దతు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో చేపట్టిన సెకండ్ ఏఎన్‌ఎంల నివవధిక సమ్మెకు గురువారం ఏఐకేఎస్ రాష్ట్ర కార్యదర్శి వార్ల వెంకటయ్య సంపూర్ణ మద్దతు ప్రకటించి మాట్లాడారు. సెకండ్ ఏఎన్‌ఎంలు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్, ఏఎన్‌ఎంల సంఘం అధ్యక్షురాలు పర్వీన, కార్యదర్శి శ్రీవిద్య, నాయకులు శ్రీనివాసులు, వెంకటస్వామి, హిమబిందు, భాగ్య, పద్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ రాములు జన్మదినం

అచ్చంపేట రూరల్: పట్టణంలో నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వనవాసి సేవా ప్రకల్పలో ఆదివాసీ చిన్నారుల మధ్య బీఆర్‌ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు కోట కిషోర్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కోట కిషోర్, ఖలీల్, సుధాకరయ్య, భాస్కర్, ఇందిరమ్మ, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

రూ.2.20 లక్షల విరాళం

వెల్దండ: దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొట్ర, బండోనిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా ఉన్న దేవాలయాలను పరిశీలించారు. కొట్రలోని చెన్నకేశవ స్వామి దేవాలయ నిర్మాణానికి రూ.1.20 లక్షలు, బండోనిపల్లిలో నిర్మిస్తున్న ఆలయాలకు రూ.లక్ష విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజయ్య, ఎంపీటీసీ రాములు, కదారి కృష్ణయ్య, నాయకులు అల్లాజీ, వెంకటయ్య, ఉస్సేన్, శ్రీను, సత్యం, ఖలీల్, రుక్కయ్య, దస్తగిరి, కృష్ణయ్య, గణేష్,అల్లాజీగౌడు, వెంకటేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదరిక నిర్మూలన

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్‌తోనే పేదరిక నిర్మూలన సాధ్యమని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన సమక్షంలో 50 మంది మహిళలు కాంగ్రెస్‌లో చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాములు, అనీల్‌గౌడ్, సైదులు యాదవ్, శ్రీపతిరాజు, గణేష్, మహేష్‌రాథోడ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

కల్వకుర్తిటౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనదని కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో నూతనంగా ఓటర్ నమోదు, ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదును చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లేష్, వైస్ ప్రిన్సిపాల్ సైదులు, ఎన్నికల డీటీలు అనిత, హరిందర్‌రెడ్డి, కళాశాల లెక్చరర్లు తదితరులు ఉన్నారు.

అవుసలికుంటలో పర్యటన

లింగాల: మండలంలోని అవుసలికుంటలో పలువురు చిన్నారులు తీవ్రజ్వరంతో సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. దీంతో గురువారం మలేరియా సబ్ యూనిట్ అధికారి అశోక్‌ప్రసాద్ ఆధ్వర్యంలో అంబట్‌పల్లి పీహెచ్‌సీ హెచ్‌ఏలు రాంచందర్, మల్లయ్య, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు గ్రామంలో పర్యటించారు. వార్డులలో దోమల నివారణ మందులను పిచికారి చేయించారు. సీజనల్ వ్యాధులు, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి శివశంకర్ పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించారు.

సంకల్ప సభను విజయవంతం చేయాలి

కోడేరు: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో శుక్రవారం నిర్వహించే బహుజన రాజ్యాధికార సంకల్ప సభను విజయవంతం చేయాలని జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీ కాటమోని లింగన్‌గౌడ్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని తెలిపారు.

గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి




అచ్చంపేట రూరల్: పట్టణంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో పలు సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా గద్దర్ సంస్మరణ సభ, సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గోపాల్, పాండు, లింగం, బాలాజీ, మోహన్, భాస్కర్, ఎంఎం గౌడ్, శ్రీశైలం, నిరంజన్, భరత్, మోతిరాం, బాలస్వామి, శ్రీరాములు, ప్రసాద్ పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నకు నివాళి



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో జై గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహానికి సింగిల్ విండో అధ్యక్షుడు రాజేందర్ గౌడ్, జైగౌడ ఉద్యమం జిల్లా నాయకుడు గుండ్రాతి నారాయణ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జై గౌడ కోడేరు మండలాధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, కట్టా ఉమాశంకర్ గౌడ్, యుగంధర్ గౌడ్, చక్రధర్ గౌడ్, రమేశ్‌గౌడ్, పెద్ద లింగస్వామి గౌడ్, మోహన్ గౌడ్, గోపి గౌడ్, నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ విడుదల



తెలకపల్లి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తాపస్) ఆధ్వర్యంలో ఈ నెల 19న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మండల కార్యదర్శి సతీష్ కుమార్ గురువారం విడుదల చేశారు. మండల కేంద్రలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. స్కావెంజర్లను నియమించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, ఆర్‌ఐ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 317 జీఓతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. వెంకట్‌రెడ్డితో పాటు సతీష్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అకాడమిక్ కన్వీనర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నియంతపాలనకు చరమగీతం పాడుదాం



మాట్లాడుతున్న దిలీపాచారి

తెలకపల్లి: రాష్ట్రంలో నియంత పాలనకు చరమగీతం పాడుదామని బీజేపీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ దిలీపాచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హఠావో, తెలంగాణ బచావో, బీజేపీ జీతావో అనే నినాదంతో పల్లెబాటలో భాగంగా ఇంటింటికి బీజేపీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నరేంద్రాచారి, కార్యదర్శి బాబు సాగర్, కృష్ణయ్య, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని నిరసన

అచ్చంపేట రూరల్: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవని సతీష్‌మాదిగ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సతీష్‌మాదిగ మాట్లాడుతూ దళిత, బీసీ, మైనార్టీ బంధు, గృహలక్ష్మి పథకాలను అర్హులకు అందించాలన్నారు. బాలాజీ, రేణయ్య, రవీందర్, జానకి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

లింగాల: పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సతీష్‌మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో తహసీల్దార్ మునిరోద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. లింగాల, అప్పాయపల్లిలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. మండల అధ్యక్షుడు సలేశ్వరం, పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా శాంతి ర్యాలీ

కల్వకుర్తిటౌన్: మణిపూర్‌లో జరిగిన దాడులను నిరసిస్తూ పట్టణంలో క్రైస్తవులు గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవులతో పాటుగా చర్చిలపై దాడులను నిరసిస్తూ పట్టణంలోని ఎంబీ చర్చి నుంచి పట్టణ పురవీధులగుండా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ శ్రీనుకు వినతి పత్రం అందజేశారు. పాస్టర్స్ జేబీ రాజు, జయరాజ్, యోహాన్, నాయకులు రవి, శివరాం ప్రసాద్, గుమ్మకొండ రాజు, ఆనంద్, ప్రేమ్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై శిక్షణ

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా శాఖ యూత్ ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్‌పై ట్రైనింగ్ ఇచ్చారు. రాష్ట్ర రెడ్ క్రాస్ జనరల్ సెక్రెటరీ మదన్ మోహన్ రావు, సెక్రెటరీ రమేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ మాధవరావు, నరేందర్ గౌడ్ పాల్గొన్నారు

గ్రామ కమిటీలు ఏర్పాటు

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోలు, కొండూరు గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో గురువారం గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. కొల్లాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకోసం కార్యకర్తలు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షుడు నర్సింహనాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవురాజు, భీంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాలరాజు

అచ్చంపేట రూరల్: క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. గురువారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. క్రడలతో ఆరోగ్యం, మేధస్సు పెంపొందుతుందన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. అలాగే పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించనున్న హమాలీ సంఘం భవనానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అరుణ, నాయకులు తులసీరాం, సుధాకర్, పర్వతాలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వడ్డెర కులస్తులను ఆదుకుంటాం

అచ్చంపేట రూరల్: వడ్డెర కులస్తులు అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వడ్డెర సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు వడ్డెర సంఘం నాయకులు అందజేశారు.

శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌కు వినతి

నాగర్‌కర్నూల్ క్రైం: హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా హోంగార్డుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హోంగార్డులకు ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. మృతి చెందిన హోంగార్డుల కుటుంబాలకు రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, హోంగార్డుల రిటైర్‌మెంట్ వయస్సును 60 నుంచి 65 సంవత్సరాలకు పెంచాలని విన్నవించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు జమ్ములు, వైస్ ప్రెసిడెంట్ రాజమల్ల, సబ్ డివిజన్ అధ్యక్షుడు యాదయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియాగాంధీదే..



కొల్లాపూర్ రూరల్: అమరవీరుల ప్రాణ త్యాగాలను చూసి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం పట్టణంలోని నాల్గో వార్డులో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడా పోటీల ప్రారంభం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలను హెచ్‌ఎం బలరామకృష్ణ ప్రారంభించారు. అండర్ 14, 16 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు.

అమ్రాబాద్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈఓ బాలకిషన్ ప్రారంభించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డివిజన్ స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, ఎంపీడీఓ రామ్మోహన్, ఎంపీఈఓ వెంకటయ్య తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

కల్వకుర్తిటౌన్: పట్టణానికి చెందిన శేఖర్‌గౌడ్, అభిషేక్‌లు మొబైల్ ఫోన్లు చోరీకి గురైనట్లు కొన్ని రోజుల కిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఈఐఆర్ ద్వారా మొబైల్‌లను గుర్తించి బాధితులకు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రమేష్ అందజేశారు. బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

దైవ దర్శనాలకు టికెట్లు రద్దు చేయాలి

మన్ననూర్: హిందు దేవాలయాల్లో దైవ దర్శనాల కోసం టికెట్లను రద్దు చేయాలని విశ్వహిందు పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సంబు వెంకటరమణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రావణమాసం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. శ్రీశైలం, తిరుపతి, యాదాద్రి, భద్రాచలం చారిత్రక దేవాలయాల్లో ఉచిత దర్శనం మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా దేవాలయాలకు దూపదీప నైవేద్యం కోసం పూజారులకు రూ: 6500 ఇస్తుండగా మసీద్‌లోని ముజావర్‌కు, చర్చీలలోని పాస్టర్లకు రూ: 15 వేలు ప్రభుత్వం చెల్లించడం సరికాదన్నారు. సమావేశంలో శేఖర్, శ్రీనువాసులు, లింగయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

లింగాల: మండలంలోని మగ్దుంపూర్‌కు చెందిన సర్పంచ్ హన్మంత్‌నాయక్ చిన్న కుమారుడు రాజేష్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం జులాయిగా తిరుగుతున్నాడని కుమారుడిని రాజేష్‌ను తండ్రి మందలించాడు. దీంతో మనస్థానికి గురై రాజేష్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పారు. అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బిజినేపల్లి: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో తిమ్మాజీపేట మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ యంత్రాలను ఉపాధ్యాయులు ఇంటికి తీసుకెళ్లి తీసుకొస్తున్నారని పలువురు ఆరోపించారు. ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హజరుకావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గోరిట సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, తిమ్మాజీపేట సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, ఎంపీడీవో కరుణశ్రీ, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉప్పల ట్రస్ట్ చేయూత

కల్వకుర్తిరూరల్: మండలంలోని లింగసానిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి లావణ్య ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతోంది. పాలిటెక్నిక్ పరీక్షల్లో మంచి ప్రతిభ ప్రదర్శించి సీటు సాధించింది. దీంతో హాస్టల్లో చేరేందుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ విషయాన్ని జాగృతి విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్ గణేష్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లగా రూ.15 వేలు ఆర్థికసాయం అందించారు. గురువారం ఉప్పల ట్రస్ట్ కార్యాలయంలో లావణ్యకు చెక్కును గణేష్ అందజేశారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుల పరిశీలన



చారకొండ గోకారంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని తోటపల్లి, ఎల్లికల్ తోపాటు పలు గ్రామాల్లో గురువారం కార్యదర్శులు క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి లింగం, ఫీల్డ్ అసిస్టెంట్ పరుశరాములు, అనిల్‌కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండలంలో 24 గ్రామ పంచాయతీలకుగాను 1811 దరఖాస్తులకు 647 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో కార్యదర్శులు పరిశీలించినట్లు ఎంపీడీఓ గంగమోహన్ తెలిపారు.

వెల్దండ: మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో మొత్తం 3169 మంది గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ అర్హులను గుర్తిస్తునట్లు పేర్కొన్నారు. ఈనెల 17నుంచి 21వ తేదీ వరకు పూర్తి సర్వే చేసి నివేదికలను ఉన్నత అధికారులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సునీత, కార్యదర్శులు సందీప్, అల్తాఫ్, బాలస్వామి, అంగన్‌వాడీ సిబ్బంది మాసమ్మ, మెర్లీన్, శివలీలా తదితరులు ఉన్నారు.

చారకొండ: మొదటి విడతగా నియోజకవర్గానికి 3 వేల మందిని గృహలక్ష్మి పథకానికి ఎంపిక చేసేందుకు అధికారులు మండలంలోని అర్హులైన పేదలను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీడీఓ జయసుధ, చంద్రాయన్‌పల్లి, గోకార గ్రామాల్లో ఎంపీఓ వెంకటేష్ పర్యవేక్షించారు.

అమ్రాబాద్: మండలంలోని మాదవానిపల్లిలో గృహలక్ష్మి దరఖాస్తులను ఎంపీడీఓ రామ్మోహన్ పంచయతీ కార్యదర్శులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.